### మొన్న మక్కా మసీదు, నేడు లుంబినీ పార్క్, గోకుల్ చాట్‌లలో బాంబు దాడులు

# మానవత్వంపై దాడి - మనుషులపై మారణ కాండను ఖండిద్దాం!

## మనోనిబ్బరాన్ని ప్రదర్శించి, టెర్రరిజం ఓడిపోతుందని చాటిన ప్రజలకు బాసటగా నిలుద్దాం!

మిత్రులారా!

హైదరాబాద్ లుంబినీ పార్క్, కోఠిలోని గోకుల్ ఛాట్‌లో 25.08.07 సాయంత్రం 7.40కి దుష్టశక్తులు అత్యంతశక్తివంతమైన బాంబులు పేల్చారు. ఇప్పటికి 44 మంది చనిపోగా, 60 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. వీరి చర్యల్ని ఆంధ్రదేశం, ప్రపంచమంతా ఖండించింది. క్షతగాత్రులకు, భాధిత ప్రజలకు అండగా నిలుస్తూఉంది. ఇలాంటి సమయాలలో అన్ని వర్గాల ప్రజలు ఇంకా ఎక్కువ సహకారాన్నివ్వాల్సి ఉంది. మామూలుగా మధ్యతరగతి మేధావుల చేత ఎగాదిగా చూపులకు గురయ్యే ఆటో కార్మికులు, ఆర్‌టిసి కార్మికులు, సామాన్య ప్రజలు, ఆపద సమయంలో ఎలాంటి తెగువ, చొరవ ప్రదర్శించారో రాష్ట్ర ప్రజలంతా చూశారు. వారిని మనసారా అభినందించారు. ప్రభుత్వం ఆర్భాటంగా చెప్పే 108లు ఫైర్ సర్వీసులు అడ్రస్‌లేవని బాధితులు, ప్రజలు ప్రశ్నించడం మనం చూశాం. ప్రభుత్వం- పాలకపక్షాలు వ్యవహరిస్తున్న తీరుని చాలామంది ప్రజలు అసహ్యించుకున్నారు. దేశంలోకి, మనరాష్ట్రంలోకి విచ్చలవిడిగా పేలుడు పదార్థాలు దిగుమతి అవుతున్నా ఆపలేనట్టుగా నటిస్తున్నారు. ప్రజల ప్రాణాలు గాలిలో కలిసినప్పుడల్లా కపట ప్రేమ నటిస్తున్నారు. కమీషన్లని, విచారణలని కాలం వెళ్ళబుచ్చుతున్నారు.

ప్రజలు నిరంతరం తమ సమస్యలపైన ప్రభుత్వాన్ని నిలదీస్తున్నప్పుడు వారిపైన లాఠీలు, తూటాలు కురిపించేందుకు ప్రభుత్వాలు లక్షలాది మంది పోలీసుల్ని రిక్రూట్ చేసుకుంటున్నాయి. ప్రజలకు రక్షణ కల్పించడానికేనని చెబుతుంటారు. అందంతా అబద్ధమని తేలిపోయింది. సరైన రాజకీయ విధానలు అన్ని వర్గాల, ప్రజల చైతన్యమే ప్రజల్ని రక్షిస్తుంది కానీ, దేశంలో ఉన్న యువకులందరినీ సైనికులుగా మార్చినా, లేక బార్డర్‌లో ఉన్న సైనికులందరినీ దేశమంతా నింపేసినా ప్రజలకు రక్షణ అసాధ్యం. లౌకిక ప్రజాస్వామిక వ్యవస్థగా చెప్పుకునే దేశంలో ఏ మతం ద్వారా గుర్తించబడినవారికైనా, ఏ విశ్వాసాలు కలిగి ఉన్నవారికైనా, మతం-కులరహితంగా బ్రతకాలనుకునేవారికైనా స్వేచ్ఛ ఉండాలి. మతమౌఢ్యాన్ని పెంచేందుకు ప్రోత్సహించకూడదు. కానీ నిరంతరం ఆ ప్రయత్నాలే జరుగుతున్నాయి. ప్రజల మధ్య ఐక్యత పెరగనీయకుండా ఉన్మాద భావజాలాన్ని పెంచే కార్యక్రమాలకు నిధులు సమకూరుస్తూనే ఉన్నారు. ఆయా కార్యక్రమాలకు అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు, అధికారులు హాజరౌతూనే ఉన్నారు. సెంటిమెంట్లను, సున్నితమైన విషయాలను రెచ్చగొడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలపైకి వారి దృష్టి మళ్ళకుండా నిరంతరం ప్రయత్నిస్తున్నారు. ఇది బ్రిటీషు వాడి నుంచి వారసత్వ జ్ఞానంగా నేర్చుకున్నారు. నేడు అమెరికా సామ్రాజ్యవాదపు CIA ఆజ్ఞలను పాటిస్తూ నిరంతరం, తమ విచ్ఛిన్నకర, విధ్వంసకర విధానాలకు, రాజకీయ సారథ్యం వహిస్తున్నారు. ఆ దుష్ఫలితాలను నేడు ప్రజలు అనుభవిస్తున్నారు.

మొన్న మక్కా మసీదులో బాంబులు పెట్టింది ఎవరైనా అవి చంపింది సామాన్య ముస్లింలనే. ఆ తర్వాత కాల్చి చంపబడిందీ వారే. ఆనాడు మరింత విధ్వంసం జరగాలని కుట్రపన్నిన వారి ఎత్తుగడలు సఫలంకాలేదు. అందుకే మరికొన్ని ప్రాంతాలను ఎన్నుకున్నారు. అవే కోఠి, లుంబినీ పార్క్ దాడులు. ఈ దాడుల్లో పారిన నెత్తురు ముస్లింలదా, హిందువులదా అని వేరుచేయలేనంతగా కలిసి పోయింది. ఉన్మాదికి, టెర్రరిజాన్ని ఆశ్రయించినవారికి ఏ విశ్వాసాలు ఉండవని ఈ దాడులు రుజువుచేస్తున్నాయి. వాళ్ళకు ప్రజల నిజమైన సమస్యల పరిష్కారం, వాటిపై ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం, ఎన్నో కష్టాలకు, త్యాగాలకు ఓర్చి సంఘటితపర్చాల్సిన అవసరం వారికి లేదు. ఒక్కమాటలో చెప్పాలంటే నిర్మించడం వారిపని కాదు. ధ్వంసం చేయడమే వారి లక్ష్యం. ఈ రకంగా ప్రజల మనోభావాలలో పెరిగే అభద్రతే పాలకులకు పెట్టుబడి అవుతుంది. వీరు అంతిమంగా దోపిడీ శక్తులకే మేలు చేస్తారు. అనేక విషయాలనుంచి దృష్టి మళ్ళించిన ఈ దాడులే ఈ విషయాన్ని ఋజువు చేస్తున్నాయి.

హైదరాబాద్ లాంటి మహానగరంలో పెరుగుతున్న రియల్‌ఎస్టేట్ దాదాగిరి, మాఫియా సంస్కృతి దేనిని సూచిస్తుంది? బహుళజాతి కంపెనీలకు ఏజెంట్‌గిరీ చేసి ప్రభుత్వ భూముల్ని అమ్మిపెట్టి కోట్లు గడిస్తున్న శక్తులెవరు? రాజకీయ చొక్కాల మాటున రకరకాల పథకాల పేరుతో కోట్లాది రూపాయలు ప్రజాధనాన్ని దారిమళ్ళించే శక్తులెవరు? నకిలీ పాస్‌పోర్టులు, నకిలీ స్టాంప్ పేపర్‌లు, నకిలీ కరెన్సీ, నకిలీ ప్రశ్నాపత్రాలు, నకిలీ డిగ్రీ పట్టాలు, చివరికి ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థుల చేతిలో ఆయుధాలు, ఎవరు తయారు చేస్తున్నారో? ఎవరు సరఫరా చేస్తున్నారో? ఏ ప్రభుత్వాలకూ తెలియదా? మహిళల్ని విదేశాలకు, రెడ్‌లైట్ ఏరియాలకు అమ్మేవాళ్ళు, పిల్లల్ని ఎగుమతి చేసేవాళ్ళు, వందలకోట్ల రూపాయల సొమ్ము దిగమింగి బోర్డులు తిప్పేసేవాళ్ళు, వీళ్ళంతా ఏ రాజకీయ శక్తుల, అధికార్ల అండలేకుండానే తప్పించుకోగలుగుతున్నారా?

వేలకోట్ల రూపాయలు కొద్దిమంది చేతుల్లో పోగుపడుతున్న ఈ హైదరాబాద్ నగరం మాఫియాల అడ్డాగా మారుతుండడం కొత్త పరిణామంకాదు. కొందరువ్యక్తులు ఇంత పెద్ద మారణకాండ చేయగలుగుతున్నారంటే ప్రజలనుంచి ప్రభుత్వాలు ఎంతగా వేరుపడిపోయాయో వేరే చెప్పనక్కరలేదు. ఈ మాఫియా లక్షణాలు పెరగడం రోగలక్షణం మాత్రమే. రోగం దోపిడీ వ్యవస్థలో ఉంది.

అమెరికా అయినా, భారతదేశమైనా, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లైనా ప్రభుత్వాలు టెర్రరిస్టు శక్తులు, మాఫియా శక్తులు ఉండాలనే కోరుకుంటారు. అలా కాకుండా వ్యవస్థపట్ల సరైన అంచనాతో సమాజంపట్ల బాధ్యతతో ఉండేవారు ప్రభుత్వ విధానాలపై నిర్దిష్టంగా ఆలోచించి యువతలో చైతన్యం రగిలించే వాళ్ళు పెరిగితే వీరు గడగడ వణుకుతారు. పెరుగుతున్న నిరుద్యోగం, ఆకలి అంతరాలు ఇవన్నీ ఇంకా వందల సంవత్సరాలు కొనసాగించుకోవడానికి దుష్టశక్తుల్ని సృష్టించి వారిని శిక్షించేందుకు పరిపాలకులుగా మేమున్నామని ముందుకొస్తూ నాటకాలాడుతున్నారు. ప్రజలకు తమ నిజ జీవితంలో కార్యాచరణలో ఈ విషయాలు అర్థమవుతున్నాయి.

SEZల పేరుతో దేశంలోని సకల సంపదలన్నీ లూటీ అయిపోతున్న సందర్భంలో, బహుళ జాతి కంపెనీల దోపిడి విచ్చల విడిగా పెరుగుతున్న దశలో, ఈ జాతినంతటినీ నిర్వీర్యం చేసే విష సాంస్కృతిక దాడులు కొనసాగుతున్న తరుణంలో నిజమైన దేశ భక్తి ఎలా ఉండాలో యువత ఆలోచించుకోవాలి. 'సమాజం గురించి మీ కెందుకని' 'ఎవరి బాగు వారు చూసుకోమని' చెపుతున్న పాలకుల, కుటిల మేధావుల వాదనలు సరికావని హైదరాబాద్‌లో జరిగిన ఈ దాడులు మరొక్కసారి రుజువు చేశాయి.

ప్రజలందరి ఉమ్మడి ఆస్థులైన ప్రభుత్వ రంగాల్ని ప్రైవేటీకరించడంవల్ల ఆపదలొచ్చినపుడు ఎలా ఉంటుందో ఉస్మానియాలో సౌకర్యాలు లేక నేలపై పడేసిన మాంసపు ముద్దలు హెచ్చరిస్తున్నాయి. కనుక యువత ఈ సమాజమార్పు కొరకు ప్రజలను చైతన్యం చేసే లక్ష్యంవైపు ఆలోచించాలి. ప్రజల పక్షాన నిలవాల్సిన గొంతులు నిరంతరం ప్రజలకు అండగా ఉండాలి. దోషుల్ని శిక్షించాలని డిమాండ్ చేయాలి. ఈ దాడుల్లో నష్టపోయిన వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేయాలి. మనవంతు బాధ్యతగా బాధితులకు అండగా నిలుద్దామని అన్ని వర్గాల ప్రజలను ఎన్‌వైఎస్ కోరుతున్నది.

హైదరాబాద్, 27.08.2007

విప్లవాభినందనలతో

# నవయువ సమాఖ్య (NYS)

### ఆంధ్రప్రదేశ్

ప్రచురణ : యం. లక్ష్మి ఎస్.కె. బాషా, అధ్యక్ష- ప్రధానకార్యదర్శులు

# మానవత్వంపై బాంబు దాడుల్ని ఖండిద్దాం !
# ప్రజలకు అండగా నిలుద్దాం !!

## కవుల, రచయితల, కళాకారుల, ప్రజాతంత్రవాదుల ప్రతిస్పందన సభ

ప్రజలారా ! మేధావులారా!

ఆగష్టు 25 శనివారం సాయంత్రం లుంబినీ పార్కు, గోకుల్ ఛాట్‌లలో జరిపిన శక్తివంతమైన బాంబు దాడులు మనుషులపైనేకాదు, మానవత్వంపైన కూడా. అంతకు ముందు మే నెలలో మక్కామసీదులో బాంబులు పేల్చారు. ఈ దాడుల్ని ప్రజలందరితో పాటు జనసాహితి, ఒ.పి.డి.ఆర్ సంస్థలు, సాహిత్యవాదులు, ప్రజాతంత్రవాదులు అందరమూ ఖండిస్తున్నాము. శనివారం జరిగిన దాడిలో ఇప్పటికి పిల్లలు మహిళలతో సహా 44 మంది చనిపోయారు. మృత్యువుతో పోరాడుతున్నవారు, తీవ్ర గాయాలైనవారు 50మందికి పైగా ఉన్నారు.

హైద్రాబాద్ లాంటి లక్షలాది మంది ప్రజలు నివసించే ప్రాంతంలో రకరకాల సంస్కృతులు-మతాచారాలు పాటించే ప్రజల్ని టార్గెట్ చేసి పదే పదే జరుపుతున్న

### కార్యక్రమం

తేది : **01.09.2007 (శనివారం)**

సమయం : సా॥ **6.00** గంటలకు

స్థలం : **సుందరయ్య విజ్ఞాన కేంద్రం మినీహాల్**
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్.

అధ్యక్షత : **నిర్మలానంద** **వి. నారాయణ రెడ్డి**

వక్తలు : **జింబో** **బొజ్జాతారకం**
**నిఖిలేశ్వర్** **ఎస్.వి. సత్యనారాయణ**
**యాకూబ్** **చంద్ర**

*మరియు వివిధ సంఘాల ప్రతినిధులు, కవులు, రచయితల ప్రతిస్పందనలు*

ఈ దాడుల లక్ష్యం స్పష్టంగానే ఉంది. విధ్వంసం-మరణకాండ ద్వారా భయానక వాతావరణాన్ని సృష్టించడం. ప్రజలలో అపవిశ్వాసాలను, విద్వేషాలను రగిల్చి కొద్దిమందిలో ఉన్న ఉన్మాదాన్ని ప్రజలదాకా తీసుకొని రావడం, తద్వారా సమాజంలో శాశ్వతంగా అనైక్యతను రుద్దడం. ఈ కుట్రలను ప్రజాతంత్రవాదులు, లౌకికశక్తులు సహించరాదు.

ప్రజలకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వాలు ఈ దాడులు జరిగినప్పుడు, ఆ తరువాత రకరకాలుగా స్టేట్‌మెంట్స్ ఇవ్వడం, విచారణలకు ఆదేశించడం, చట్టాలకు మెరుగులు దిద్దాలని ప్రకటించడం, మనం చూస్తున్నాం. అయితే లౌకిక ప్రజాస్వామిక దేశంలో నిరంతరం లౌకిక భావనలు-సంస్కృతి, ప్రజాస్వామిక చైతన్యం, ప్రాథమిక దశనుంచి ఉన్నత దశకు పెంచుతామని చెపుతున్నవారు ఆ హామీలను ఏ విధంగా అమలు చేస్తున్నారు? సమాజంలో వివిధ వర్గాల మధ్య, వివిధ మతాల మధ్య అంతరాల్ని తగ్గించడానికి ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలేంటి? ప్రజల్ని రక్షించేది చట్టాలు, మిలటరీ, పోలీసు వ్యవస్థలేనా? రాజకీయ విధానాల, శాసనకర్తల పాత్ర ఏమిటి? ప్రజలందరి శ్రేయస్సు కోరే ప్రజాచైతన్యం అంటే ఏమిటి? మొదలగు విషయాలను కవులు, కళాకారులు, ప్రజాతంత్ర వాదులు ఈ సభలో తమ తమ ప్రతిస్పందనల ద్వారా తెలియజేస్తారు.

ఈ సభలో మాతో పాటుగా మీరూ పాల్గొని ఆత్మీయుల్ని కోల్పోయిన వారికి ధైర్యం చెపుతారని, టెర్రరిస్టు విధానాల ద్వారా ప్రజల మనోనిబ్బరాన్ని దెబ్బతీయలేరని చాటి చెపుతారని ఆశిస్తున్నాం. దాడులు చేసిన వారి కుట్రలకు గురై ఘర్షణలకు దిగకుండా ధైర్యాన్ని ప్రదర్శించిన ప్రజలందరిని, ఆపద సమయంలో అండదండలు అందించిన వారిని అభినందించేందుకు ఈ సభకు రావాలని కోరుతున్నాము.

ఇట్లు

హైదరాబాద్, 29.08.2007

**జనసాహితి** **ఓపిడిఆర్**
**ఆంధ్రప్రదేశ్**

ప్రచురణకర్తలు : **నిర్మలానంద**-గౌరవ సంపాదకులు, ప్రజాసాహితి
**వి.నారాయణరెడ్డి** -రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఒపిడిఆర్